

అర్హులకు ఇళ్లస్థలాలివ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

అర్హులైన నిరు పేదలందరికీ ఇళ్లస్థలాలను కేటాయించాలని సోమవారం గ్రీవెన్స్ సందర్భంగా ఆర్డీవో కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆర్డీవో రామ్మోహన్ స్పందించి లబ్దిదారులందరికీ ఇళ్లస్థలాలను కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఈ ధర్నాలో సిపిఎం నగర కార్యదర్శి కె.వేణుగోపాల్, పి.సాయిలక్ష్మి, ఎన్.మాధవ్, పి.బుజ్జి, ఎం.నరేంద్ర, ఎం.జయంతి, ఎం.రాజు పాల్గొని ప్రసంగించారు.

స్మగ్లర్ల తాటతీసేది సరే...

సిబ్బంది బలిదానాలకు భరోసా ఏది..?

- డేవిడ్ కరుణాకర్, శ్రీధర్ కేసులు ఏమయ్యాయి
- నిర్వీర్యంపై అటవీ సిబ్బందిలో నిరాశ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

విధి నిర్వహణలో స్మగ్లర్ల చేతిలో అతి దారుణంగా కిరాతకంగా రాళ్లతో కొట్టి చంపబడ్డ డేవిడ్ కరుణాకర్, ఎన్.ఆర్. శ్రీధర్ బలిదానాలకు అటవీశాఖ ఎలాంటి విలువ ఇచ్చింది అన్నది ప్రశ్నార్ధకమే. 2013, డిసెంబర్ 15వ తేదీన శేషాచలం అటవీ ప్రాంతంలోని పెద్ద బండల చేను వద్ద వందమంది స్మగ్లర్లు ఒక్కసారిగా చుట్టుముట్టి ఎనిమిది మంది సభ్యుల అటవీశాఖ సిబ్బందిపై దాడికి పాల్పడడంతో కొంతమంది గాయాలపాలై, కొంతమంది తప్పించుకుని ప్రాణాలు కాపాడుకున్నారు. అయితే డేవిడ్ కరుణాకర్, ఎన్.ఆర్. శ్రీధర్ లను స్మగ్లర్లు చుట్టుముట్టి రాళ్లతో మూకుమ్మడి దాడి చేసి హతమార్చారు. విధులకు తీసుకెళ్లిన టాటా సుమో ప్రభుత్వ వాహనాన్ని సైతం ధ్వంసం చేశారు. ఈ ఘటనపై అప్పట్లో దేశవ్యాప్తంగా ఒక్కసారిగా చర్చ జరిగింది. రేణిగుంట పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. దీనిపై దర్యాప్తు చేపట్టిన అధికారులు దాడికి పాల్పడిన వారిని గుర్తించి న్యాయస్థానం ముందు నిలబెట్టలేకపోయారని అటవీ విభాగంలో చర్చ నడుస్తోంది. ఒక ప్రభుత్వ అధికారి విధులలో స్మగ్లర్ల చేత కిరాతకంగా చంపబడితే ఆ ఉద్యోగి పట్ల ఆ శాఖ ఉన్నతాధికారులు ఉదాసీనంగా వ్యవహరించడం పలు విమర్శలకు దారితీస్తోంది. అటు తర్వాత అప్పట్లో టాస్క్ ఫోర్స్ ఐజిపి మాగంటి కాంతారావు నేతత్వంలో స్మగ్లర్ల దుశ్చర్యకు ప్రతిగా దాడికి మళ్లీ పాల్పడడానికి పూనుకున్న స్మగ్లర్లపై శ్రీనివాస మంగాపురం వద్ద 11 మందిని, శ్రీవారి మెట్టు వద్ద 9 మందిని ఎన్కౌంటర్ చేశారు. అటు తర్వాత అయినా ఎర్రచందనం స్మగ్లింగ్ ఆగిందా అంటే... మరింతగా పెరిగిపోయింది. స్మగ్లర్లు ఏ ధైర్యంతో ప్రభుత్వ అధికారులను, టాస్క్ ఫోర్స్ సిబ్బందిని లెక్కచేయకుండా ప్రాణాలు తీస్తున్నారు.

అటవీ అమరవీరుల దినోత్సవం సందర్భంగా.....

నవంబర్ 10వ తేదీ ప్రతి ఏటా అటవీ అమరవీరుల దినోత్సవాన్ని అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తుంటారు. అయితే విధి నిర్వహణలో వీరోచిత పోరాటం చేసి అశువులు బాసిన అధికారులకు, సిబ్బంది త్యాగాలను స్మరించుకుంటూ గడిపేస్తున్నారు. వారి ప్రాణ త్యాగాలకు ప్రతిగా అటవీశాఖ ఏం చేస్తోందన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. అటవీ శాఖకు సంబంధించి డేవిడ్ కరుణాకర్, ఎన్.ఆర్. శ్రీధర్,

సోమవారం జూ పార్కులో అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పిస్తున్న పిసిసిఎఫ్ చలపతిరావు

టాస్క్ ఫోర్సు సంబంధించి గణేష్ వీరి మరణాలకు కారణమైన వారిని న్యాయస్థానాల ముందు నిలబెట్టి శిక్షలు వేస్తున్నారా?.

పకడ్బందీ ఆధారాలతో స్మగ్లర్లకు శిక్షలు....

ఎర్రచందనం స్మగ్లింగ్ చేయడానికి, శేషాచలం అటవీ పరిధిలో నిషేధిత ప్రాంతంలోకి వచ్చిన వారిని అటవీ శాఖ కావచ్చు.... టాస్క్ ఫోర్స్ కావచ్చు అదుపులోకి తీసుకొని వారి నేర నిరూపణ అయ్యే విధంగా పగడ్బందీ ఆధారాలను న్యాయస్థానం ముందు ఉంచి వారికి శిక్షలు పడేలా కషి చేస్తున్నారు. ఇది చాలా అభినందించాల్సిన విషయమే. ఇదే విధమైన చొరవ అధికారులను, సిబ్బందిని చంపిన వారిపై ఎందుకు చూపడం లేదనేది ప్రజానీకం నుండి వస్తున్న ప్రశ్న. ఎంతో సాహసించి అడవులలోకి వెళ్లి విధులు నిర్వర్తించి అరుదైన జాతి సంపద అయిన ఎర్రచందనం కాపాడడానికి అహర్నిశలు అటవీశాఖ, టాస్క్ ఫోర్స్ కషి చేస్తున్నాయి. మరి క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ఎటువంటి రక్షణ ఉంది అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న.

దీనిపై ఇప్పటికీ స్పష్టత లేదు....

విధి నిర్వహణలో భాగంగా టాస్క్ ఫోర్స్ సిబ్బంది కలికిరి వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా గణేష్ అనే టాస్క్ ఫోర్స్ సిబ్బందిని స్మగ్లర్లు వేగంగా కారుతో ఢీ కొట్టి చంపేశారు. అటు తర్వాత చింతలపాలెం వద్ద ఇదే టాస్క్ ఫోర్స్ సిబ్బందిని ఇలానే కారుతో ఢీకొట్టారు...ఢీకొట్టిన వ్యక్తి ఆరోగ్యం ఎలా ఉందో? అధికారుల నుండి సమాచారం లేదు. శ్రీకాళహస్తిలో విధులు నిర్వహిస్తున్న డిఆర్ఓ మల్లికార్జున ఎలా చనిపోయారో... దీనిపై కూడా ఎటువంటి స్పష్టత లేదు. వీరి ప్రాణ త్యాగాలకు అటవీ శాఖ గాని, టాస్క్ ఫోర్స్ గాని న్యాయస్థానాల ముందు దోషులను నిలబెట్టడంలో విఫలమయ్యిందా?

ఎర్రచందనం జోలికొస్తే తాటతీస్తాం అన్నారు...

శేషాచలం అడవులలో మాత్రమే దొరికే అరుదైన ఎర్రచందనం జోలికి వస్తే తాట తీస్తామని అటవీ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ తిరుపతి పర్యటనలో స్పష్టం చేశారు. స్మగ్లర్లు ప్రత్యామ్నాయ పనులకు వెళ్లిపోవాలని, లేకుంటే కఠిన చర్యలు ఎదుర్కో తప్పదని, ఆపరేషన్ కగార్ తరహాలో ఎర్రచందనం పరిరక్షణకై నూతనంగా ఆపరేషన్ ప్రారంభిస్తామని విలేకరుల సమావేశంలో తెలిపారు. ఎర్రచందనం పరిరక్షించడానికి ఆపరేషన్ కగార్ తరహాలో వ్యవహరిస్తామని చెప్పిన మంత్రి పవన్ కళ్యాణ్ ఎర్రచందనం పరిరక్షణ కోసం స్మగ్లర్లతో పోరాడుతూ ప్రాణాలు అర్పించిన అటవీ శాఖ సిబ్బంది, టాస్క్ ఫోర్స్ పోలీసులు కేసులకు సంబంధించి న్యాయస్థానం ముందు దోషులను నిలబెట్టడంలో విఫలమైన పరిస్థితిని సమీక్షించి, అసువులు బాసిన అధికారుల మరణాలకు కారణమైన వారిని న్యాయస్థానం ముందు నిలిపేలా చర్యలు తీసుకుంటారా అనేది వేచి చూడాలి.

తిరుపతి టిడిపి ఆఫీసుకు..

నెలకు రూ.1000 అద్దెట..!

- 2 ఎకరాలు 33 ఏళ్లకు లీజు
- కుప్పం విమానాశ్రయానికి హడ్కో నిధులు
- పెద్దిరెడ్డి అక్రమాలపై ఆధారాలతో వీడియో
- క్యాబినెట్‌లో నిర్ణయాలు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తెలుగుదేశం జిల్లా పార్టీ కార్యాలయ నిర్మాణానికి ప్రభుత్వ భూమి అవిలాల వద్ద 2 ఎకరాలు తీసుకోవాలని ప్రభుత్వం క్యాబినెట్‌లో చర్చించి ఆమోదించింది. అవిలాల వద్ద జిల్లా పార్టీ కార్యాలయం కోసం రెండు ఎకరాల స్థలాన్ని 33 ఏళ్లపాటు లీజుకు నెలకు వెయ్యి రూపాయల అద్దె చొప్పున చెల్లించేలా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సోమవారం ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జరిగింది. 70 అంశాలపై రాష్ట్రవ్యాప్తంగా చర్చించారు. ప్రధానంగా తిరుపతి, చిత్తూరు జిల్లాలకు సంబంధించి ప్రస్తావన, నిర్మాణ పనులకు ఆమోదం తెలిపింది. కుప్పంలో నిర్మాణం అవుతున్న విమానాశ్రయానికి హడ్కో నిధులు కేటాయించనుంది. తిరుపతిలో పరిశ్రమల స్థాపనకు ఆమోదం తెలిపింది. మంత్రివర్గ సమావేశంలో డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ తిరుపతి, చిత్తూరు జిల్లాల పర్యటనలో పర్యటించిన వివరాలను టూకీగా మంత్రివర్గానికి తెలిపారు. వైసిపి నేత మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అక్రమాలపై ఆధారాలతో సహా వీడియో తీయించినట్లు చెప్పారు. నిల్వ ఉంచిన ఎర్రచందనాన్ని ఏ విధంగా విక్రయించాలనే అంశంపై ఆసక్తికరమైన చర్చ నడిచినట్లు తెలుస్తోంది. పవన్‌కల్యాణ్ ఎర్రచందనం గురించి చెబుతుంటే మంత్రివర్గం ఆసక్తికరంగా వినడం గమనార్హం.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో 45 మంది ఎంఎల్‌ఎలు మెరుగుపరచుకోవాలని, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రులు ఆ బాధ్యత తీసుకోవాలన్నారు. ఏడాదిలోపు అర్హులైన పేదలందరికీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకునేలా చేస్తామన్నారు. అర్హులను గుర్తించి ఇళ్లు వచ్చేలా కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వస్తున్న రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ఇన్‌ఛార్జిమంత్రులు బాధ్యత వహించాలన్నారు.

మహాకవి అందెశ్రీ : పేటశ్రీ

ప్రజాశక్తి - క్యాంపస్

తెలంగాణ రాష్ట్ర గీతాన్ని రచించిన అందెశ్రీ మహాకవి అని ఆంధ్రప్రదేశ్ తెలుగు వ్యవస్థాపక డైరెక్టర్ ఆచార్య పేట శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. ఆయన ఆకస్మిక మతి తెలుగు సాహిత్య లోకానికి తీరని లోటని అన్నారు. అనేక పాటలు రచించి ప్రజల మనస్సులో సుస్థిర స్థానాన్ని అలంకరించారన్నారు. ఇటీవల హైదరాబాద్ లోని ఉస్మానియా యూనివర్శిటీలో జరిగిన ఆచార్య బిరుదురాజు రామరాజు శత జయంతి ఉత్సవాల్లో తాము పాల్గొని, ఎంతో అన్యోన్యంగా గడిపిన విషయాన్ని పేటశ్రీ ఈ సందర్భంగా గుర్తు చేసుకొన్నారు. ఆయన మతికి తీవ్ర సంతాపాన్ని వెలిబుచ్చారు.

చెట్టుపై నుంచి పడి గిరిజనుడు మృతి

ఆలస్యంగా వెలుగులోకి...

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

చెట్టుపై నుంచి పడి ఓ గిరిజనుడు మృతి చెందిన విషాదకర ఘటన శ్రీకాళహస్తి రూరల్ మండలం ముళ్ళపూడి గిరిజన కాలనీలో సోమవారం ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి పోతే.. ముళ్ళపూడి గిరిజన కాలనీకి చెందిన తుపాకుల కన్నయ్య(50) పొట్టకూటి కోసం మరొక గిరిజనుడుతో కలిసి ఆదివారం ఉదయం సమీపంలో ఉన్న నారాయణపురం గ్రామానికి చెందిన బత్తి రెడ్డి అనే రైతుకు చెట్టు కొమ్మలు నరికేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో కాలుజారి కిందపడ్డాడు. ఆదివారం సాయంత్రం శ్రీకాళహస్తి పట్టణంలోని ఊరందూరు సర్కిల్ లో ఉన్న ఆర్ఎంపీ డాక్టర్ వద్ద ప్రాథమిక చికిత్స చేయించి సదరు రైతు కన్నయ్యను ఇంటి వద్ద విడిచిపెట్టాడు. సోమవారం తెల్లవారుజామున కన్నయ్య మతి చెందాడు. అయితే కన్నయ్యను పని కోసం తీసుకెళ్లిన రైతు బత్తి రెడ్డి మెరుగైన వైద్యం అందించకపోవడం కారణంగానే మృతి చెందాడని సిపిఐ మండల కార్యదర్శి మించల శివకుమార్ ఆరోపించారు. మతుడికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారనీ, కన్నయ్య అర్ధాంతర చావుతో వారంతా వీధిన పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కన్నయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'పి4'పై ఎన్ఆర్ సుబ్రమణ్యంరాజు ఆసక్తి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పి4 పథకంలో భాగంగా పలు బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటానని ప్రముఖ పారిశ్రామికవేత్త, ఎన్ఆర్ఐ సుబ్రమణ్యం రాజు ఆసక్తి చూపించారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌ను కలిసారు. ఎన్ఆర్ఐ సుబ్రమణ్యం రాజు మాట్లాడుతూ గతంలో తన స్నేహితుడు మహ్మద్ అరీఫ్, కడప వారు మార్గదర్శకునిగా మారి బంగారు కుటుంబంలో భాగంగా తిరుపతి జిల్లాపై మక్కువతో ఒక గ్రామాన్ని దత్త త తీసుకున్నారని తెలిపారు. తాను కూడా ఆసక్తి చూపిస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ సుబ్రమణ్యం రాజు తీసుకున్న నిర్ణయాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి పి. రాజశేఖర్ పాల్గొన్నారు.

ఫలవంతమైన జీవితం స్కిమ్స్ లక్ష్యం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

విద్యార్థులకు ఫలవంతమైన జీవితాన్ని ఇవ్వడమే స్కిమ్స్ కళాశాల లక్ష్యమని ఆ కళాశాల అధినేత మిద్దెల హరి అన్నారు. స్థానిక స్కిమ్స్ కళాశాలలో సోమవారం తరగతులను ప్రారంభించారు. పలువురు విశ్రాంత ప్రిన్సిపాళ్ళు, ప్రధానోపాధ్యాయులు ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి తరగతులను ప్రారంభించారు. మిద్దెల హరి మాట్లాడుతూ ఇక్కడ చదివే ప్రతి విద్యార్థిని ఉన్నత స్థాయిలో నిలబెట్టడమే స్కిమ్స్ మిషన్, విజన్ అని చెప్పుకొచ్చారు. ఆ స్థాయిలో విద్యార్థులకు తర్ఫీదునిచ్చే అనుభవజ్ఞులైన అధ్యాపక బందం స్కిమ్స్ వద్ద ఉందన్నారు. విద్యార్థులు తరగతులకు సక్రమంగా హాజరై సామర్థ్యాలు, నైపుణ్యాలతో పాటు నైతిక విలువలను మెరుగు పరుచుకోవాలని సూచించారు. రఘురామిరెడ్డి, సత్యనారాయణ రావు, అన్వర్ ఖాన్ బహుమణి, విద్యాసాగర్, సౌందర్యరాజ్ పాల్గొన్నారు.

20, 21 తేదీల్లో రాష్ట్రపతి తిరుపతి పర్యటన

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఈ నెల 20, 21 తేదీలలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిరుపతి జిల్లాలో రెండు రోజులపాటు పర్యటించనున్న నేపథ్యంలో చిన్నపాటి లోపాలకు తావివ్వరాదని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఎస్పితో కలిసి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ భారత రాష్ట్రపతి 20న మధ్యాహ్నం 3.25 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని, అక్కడ నుంచి రోడ్డు మార్గాన 3.35 గంటలకు బయల్దేరి 3.55 గంటలకు తిరుచానూరు అమ్మవారిని దర్శించుకుంటారు. 4.30 గంటలకు బయల్దేరి 5.20 గంటలకు తిరుమల చేరుకుని పద్మావతి అతిథిగృహానికి చేరుకుని రాత్రికి బస చేస్తారు. మరుసటిరోజు 21వ తేదీ ఉదయం 9.20 గంటలకు తిరుమల వరాహస్వామిని, 10 గంటలకు శ్రీవారిని దర్శించుకుంటారు. 10.50 గంటలకు తిరుమల నుంచి బయల్దేరి 11.50 గంటలకు తిరపతి విమానాశ్రయం చేరుకుని హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం అవుతారు.

.ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘు వాన్షి, అదనపు ఎస్పీ రవి మనోహరా చారి, జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు, తిరుపతి , శ్రీకాళహస్తి ఆర్ డి ఓ లు రామ్ మోహన్, భాను ప్రకాష్ రెడ్డి, డి.ఎం.హెచ్, ఓ బాల కష్ణ నాయక్, ఆర్ అండ్ బి ఎస్.సి రాజా నాయక్, డి.పి.ఓ సుశీల దేవి, డి.ఆర్.డి. ఏ పి.డి శోభన్ బాబు పాల్గొన్నారు.

32 కిలోల గంజాయి, వాహనం స్వాధీనం

సినీఫక్కిలో పట్టుకున్న పోలీసులు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

అక్రమంగా తరలిస్తున్న 32 కిలోల గంజాయిని పోలీసులు, సినీఫక్కిలో ఛేదించి స్వాధీనం చేసుకున్నారని తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా పోలీసులు గంజాయి అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటూ, దానిని పూర్తిగా అరికట్టే దిశగా నిరంతరంగా పనిచేస్తున్నారన్నారు. ఈ క్రమంలో చంద్రగిరి పోలీసులు మరో విజయవంతమైన ఆపరేషన్‌ను నిర్వహించారు" అని తెలిపారు. గంజాయి అక్రమ రవాణాపై సమాచారం అందడంతో, చంద్రగిరి డిఎస్పీ ప్రసాద్, పాకాల సిఐ, చంద్రగిరి ఏం.ఆర్.ఓ, చంద్రగిరి సీఐ ఎం.సురేష్ కుమార్, ఆర్‌సి పురం ఎస్ఐ ఎం. భక్తవత్సలం, చంద్రగిరి ఎస్ఐ వై.అనిత బందం ఆదివారం మధ్యాహ్నం తిరుపతి నాయుడుపేట జాతీయ రహదారి తువ్వ చేనుపల్లి గ్రామ సమీపంలో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఒరిస్సా నుండి తమిళనాడు రాష్ట్రానికి చెందిన పొన్నుస్వామి సెల్వరాజ్ గంజాయి అక్రమ రవాణాను సినీఫక్కిలో తరలిస్తుండగా చంద్రగిరి పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ముద్దాయి తరలిస్తున్న కారులో సాధారణ తనిఖీ చేయగా ఏ విధమైన గంజాయి కనబడలేదు. అనుమానంతో

పోలీస్ జాగిలం సహాయంతో తనిఖీ చేపట్టారు. గంజాయి కారులో డాష్ బోర్డు, గేర్ బాక్స్, టైర్ స్టెప్ భాగంలోఉన్నట్టు జాగిలాలు కనిపెట్టాయి. వాహనంలో దాచిన 32.730 కిలోల 27 ప్యాకెట్ల గంజాయి స్వాధీనం చేసుకుని, వాహనం నడుపుతున్న పొన్నుస్వామి సెల్వరాజ్ (43)ను అదుపులోకి తీసుకున్నారు. వాహనంలో దొరికిన గంజాయి, రెండు మొబైల్ ఫోన్లు, వాహనాన్ని స్వాధీనం చేసుకొని, మొత్తం సుమారు రూ. 6 లక్షల విలువైన సొత్తును జప్తు చేశారని తెలిపారు. ఎక్కడైనా ఇలాంటి అక్రమ రవాణా చూసినట్టు సమాచారం అందిన వెంటనే పోలీస్ కంట్రోల్ రూమ్ 112కు సమాచారం అందించి, సహకరించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అనంతరం ఈ కేసులో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని అభినందించారు.

పరిశోధనల్లో ప్రగతి ఆవశ్యకం

ప్రజాశక్తి - క్యాంపస్

విశ్వవ్యాప్తంగా నిత్యం కొత్తపుంతలు తొక్కుతున్న సాంకేతిక విజ్ఞానాన్ని సరైన విధానంలో సద్వినియోగం చేసుకోవడం ద్వారా పరిశోధన రంగంలో ప్రగతిని సాధించవచ్చని ఏపీ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ఆచార్య కొత్త మధుమూర్తి పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం భౌతికశాస్త్ర విభాగం, తిరుపతి, ముంబయ్‌లోని వెస్టర్న్ రీజనల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ సెంటర్ ఢిల్లీలోని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఆధ్వర్యంలో నడిచే జాతీయ పరికరాల సౌకర్య కేంద్రం సంయుక్తంగా నిర్వహిస్తున్న 'ఫ్యాకల్టీ కోసం ల్యాబొరేటరీ పరికరాల ఆపరేషన్, మెయింటెనెన్స్' పై ఒక వారం పాటు నైపుణ్యాభివద్ధి కార్యక్రమం 2025 డిసెంబర్ 15 నుంచి 19 వరకు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం భౌతికశాస్త్ర విభాగంలో జరగనుంది. ఈ సందర్భంగా ఉన్నత విద్యా మండలి వైస్ ఛైర్మన్ ఆచార్య విజయభాస్కరరావుతో కలిసి ఛైర్మన్ ఆచార్య

మధుమూర్తి ఈ కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను సోమవారం మంగళగిరిలోని మండలి కార్యాలయంలో విడుదల చేశారు. ఈ తరహా నైపుణ్యాభివద్ధి కార్యక్రమాలు ఉన్నత విద్యా రంగంలో సాంకేతిక ప్రావీణ్యాన్ని పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఆచార్య దేవప్రసాద్ రాజు, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లు డా. పి. చంద్రశేఖర్, డా. పి. చెంగయ్య, డా. ఎం. హరి ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కళత్తూరు ముంపు బాధితులకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి - కెవిబిపురం

సిఐటియు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పిచ్చాటూరు ప్రాజెక్టు కమిటీ ఆధ్వర్యంలో వరద ముంపు బాధితులకు చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు రాజేశ్వరి, ఇంద్రాణి మాట్లాడుతూ రాయల చెరువు తెగినందువలన సర్వస్వం కోల్పోయిన కళత్తూరు దళితులకు ఉడతా భక్తిగా చీరలు పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్దన్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మెలుగు రమేష్, కేవీబి పురం ప్రాంతీయ కార్యదర్శి నాగలాపురం నాగరాజు, అంగన్వాడీ యూనియన్ నాయకులు కళ్యాణి, కష్ణవేణి, విజయలక్ష్మి, సుభాషిని, విజయ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మురుగేష్, యూత్ నాయకుడు రామ్ పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ తీరు సరికాదు : సిపిఎం

తిరుపతి టౌన్ : తిరుపతి, చిత్తూరు జిల్లాల పర్యటన నిమిత్తం వచ్చిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తిరుపతి జిల్లాలో అత్యంత దయనీయ పరిస్థితుల్లో ఉన్న కళత్తూరు ముంపు బాధితులను పరామర్శించకపోవడం సరైన పద్ధతి కాదని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు విమర్శించారు. రెండు రోజులు పాటు జిల్లాలోనే ఉన్న ఆయన కొద్ది సమయం బాధితులతో గడిపి ఉంటే వారికి ధైర్యాన్ని కల్పించిన వారు అయ్యే వారని తెలిపారు. భరోసా కల్పించాల్సిన స్థాయిలో ఉన్న వ్యక్తి బాధ్యతా రాహిత్యంగా తప్పించుకుపోవడం సరైనది కాదని అన్నారు. చివరికి బాధితులే ఆయన్ని కలవడానికి తిరుపతి కలెక్టరేట్‌కు విచ్చేస్తే వారిని కలవకపోవడం విజ్ఞతగా లేదని తెలిపారు. బాధల్లో ఉన్న ప్రజల్ని నిర్లక్ష్యం చేసిన వారికి తగిన విధంగా ప్రజలు సమాధానం చెప్తారని తెలిపారు. బురదమయం అయ్యి పశు వులు చనిపోయి ఇంట్లో ఉన్న సర్వస్వం కోల్పోయి బాధపడుతున్న వారి బాధలు జనసేన పార్టీకి పట్టవా అని విమర్శించారు.

ఎస్ఎఫ్ఐ చేయూత

క్యాంపస్ : కేవీబీ పురం మండలంలోని కళత్తూరు గ్రామంలో ఆకస్మికంగా సంభవించిన వరదల వల్ల నష్టపోయిన విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందించడానికి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని పరిపాలన భవనంలో ఉద్యోగుల నుంచి రూ.14,050 విరాళాలుగా సేకరించారు. వర్సిటీ ఎన్ఎస్ఎస్ టీంను కళత్తూరు గ్రామానికి పంపి అక్కడ సేవా కార్యక్రమాలు నిర్వహించాలని రిజిస్ట్రార్ భూపతి నాయుడుకి ఎస్ఎఫ్ఐ నాయకులు వినతిపత్రం ఇచ్చారు.

పరామర్శించడానికి ఒక్క మంత్రీ రాలేదు : చింతామోహన్

తిరుపతి సిటి : కళత్తూరు దుర్ఘటన నేపథ్యంలో సర్వం కోల్పోయిన ఎస్సీలను పరామర్శించడానికి ఒక్క మంత్రీ రాలేదని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ అన్నారు. ప్రత్యేక విమానాల్లో వచ్చి, హెలికాప్టర్లలో తిరిగిన ఒకాయన ఏనుగులను, ఎర్రచందనాన్ని చూసి వెళ్లారు తప్ప, దళితులు కనిపించలేదా అని ప్రశ్నించారు. తిరుపతిలో మీడియాతో మాట్లాడుతూ కూలీలను చంపాల్సిన అవసరం లేదని, ఎర్రచందనం స్మగ్లింగ్ ఎలా ఆపాలో పవన్‌కల్యాణ్‌కు తెలియకపోతే తన దగ్గరకు వస్తే చెబుతానని అన్నారు. కళత్తూరు ఎస్సీలను కాపాడటంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు.

మొదలియార్లకు పదవుల వర్షం

ఉమ్మడి జిల్లాలోనే రాష్ట్ర డైరెక్టర్లు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

చిత్తూరు, తిరుపతి ఉమ్మడి జిల్లాల్లో కూటమి ప్రభుత్వం మొదలియార్లకు పదవుల వర్షం కురిపించింది. రాష్ట్రవ్యాప్తంగా పది కుల కార్పొరేషన్లకు బోర్డు డైరెక్టర్లను 122 మందిని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఏడాది క్రితమే ఆంధ్రప్రదేశ్ మొదలియార్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా తిరుపతికి చెందిన సిఆర్ రాజన్‌ను రాష్ట్ర అధ్యక్షులుగా ప్రకటించింది. ఇప్పటివరకూ ఆ కార్పొరేషన్‌కు డైరెక్టర్లను ప్రకటించలేదు. తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో తప్ప రాష్ట్రంలో మరెక్కడా మొదలియార్లు లేరు. దీంతో ఉమ్మడి జిల్లాలోనే జనసేన, బిజెపి, టిడిపి మొదలియార్ నాయకులకు ఈ డైరెక్టర్ పదవులు వరించాయి.

టిడిపిలో.. : ఎ.నాగరాజు (పూతలపట్టు), ఎ.నమశ్శివాయన్ (సత్యవేడు), ఎం.మణి (కుప్పం), ఎం.శ్రీకాంత్ (పుంగనూరు), ఎన్.ధనపాల్ (నగరి), ఎన్.భాస్కరన్ (సత్యవేడు), పెరుమాల్ మధుబాబు (తిరుపతి), ఎస్.ముత్తయ్య (నగరి), ఎస్.శరవణ (చంద్రగిరి), ఎస్‌కె.శ్రీధర్ (తిరుపతి), ఎస్ఎస్ నటరాజన్ (జీడీనెల్లూరు), వి.గోపాలక్రిష్ణన్ (చిత్తూరు), వినోద్‌కుమార్ (కుప్పం), పుంగనూరు నుంచి జనసేన నాయకులు జి.మణికంఠ, బిజెపికి చెందిన తిరుపతి నాయకులు బీడీ బాలాజీలకు రాష్ట్రస్థాయి డైరెక్టర్ పదవులు లభించాయి.

భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి ఆశ్రమ వైద్యశాలలో 'బర్డ్' సేవలు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి ఆశ్రమ వైద్యశాల ప్రాంగణం మానవ సేవకు కొత్త వేదికగా మారింది. తిరుమల తిరుపతి దేవస్థానం బర్డ్ ఆస్పత్రికి సంచాలకులుగా డాక్టర్ గుడారు జగదీష్ తిరిగి బాధ్యతలు స్వీకరించిన తర్వాత నిర్వహించిన మొట్టమొదటి ఉచిత వైద్య శిబిరం అపారమైన ఆదరణతో విజయవంతమైంది. ఆశ్రమం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అండ్ మెంబర్ సెక్రటరీ పి. బాల సుబ్రమణ్యం, ఐ.ఏ.ఎస్ (రిటైర్డ్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో ఆర్థోపెడిక్ సమస్యలు, కీళ్ల నొప్పులు, వెన్నెముక వ్యాధులతో బాధపడుతున్న 300మందికి పైగా రోగులను బర్డ్ హాస్పిటల్ నిపుణుల బందం పరీక్షించి, వారికి తగిన వైద్య చికిత్స అందించింది. ఈ సందర్భంగా డాక్టర్ గుడారు జగదీష్ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలకు అత్యున్నత స్థాయి ఆర్థోపెడిక్ చికిత్సలను అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యమని తెలిపారు. పరీక్షించిన రోగులలో ఎవరికైతే తక్షణమే. లేదా సమీప భవిష్యత్‌లో అవసరమయ్యే వారికి ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా బర్డు ఆస్పత్రిలో ఉచితంగా శస్త్ర చికిత్సలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరం ఒక్కరోజుకే పరిమితం కాదని, ప్రజారోగ్యం పట్ల తన నిబద్ధతను తెలియజేస్తూ, ప్రతినెలా ఒక ఆదివారం గొలగమూడిలోని భగవాన్ ఆశ్రమంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు చెప్పారు.

బాలుని కాలు పరిశీలిస్తున్న డాక్టర్ జగదీష్

గిరిజన కాలనీపై నిర్లక్ష్యం తగదు

■ చిన్న గుడిసెల్లో రెండేసి కుటుంబాల నివాసం ■ సరిగా అందని సంక్షేమ పథకాలు ■ తుపాను నష్ట పరిహారం అందేనా? ■ వీధి లైట్లు లేక అంధకారం

ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని, మహాలక్ష్మీ నగర్, గిరిజన కాలనీలో గిరిజనులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వ అధికారుల దృష్టిలో వారు ఉన్నారన్న ఆలోచన కూడా లేదని సిపిఎం నాయకులు ముకుంద ఆరోపించారు. ఆది, సోమ వారాల్లో వారి సమస్యలు తెలుసుకోవడానికి ఆ కాలనీలో సిపిఎం, సిఐటియు నాయకులు పర్యటించారు. కాలనీ గిరిజనులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమస్యలపై మున్సిపల్ కార్యాలయం వద్ద మండల తహశీల్దార్ కార్యాలయంలో ధర్నాలు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్‌కు అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల నాయకులు ఎస్.కె అబ్దుల్లా మాట్లాడుతూ ఈ కాలనీలో దాదాపుగా 40 ఏళ్ల నుండి 50 కుటుంబాలు నివాసం ఉంటున్నాయన్నారు. వారిలో అధిక శాతం మంది గిరిజనులు ఉన్నారని, ఈ కాలనీలో గత మూడు నెలల నుండి వీధిలైట్లు వెలగడం లేదని, అంధకారంలో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్న అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. కరెంటు స్తంభాలు విరిగిపోయి పడడానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. వారి నివాసాల చుట్టూ పక్కల పిచ్చి చెట్లు పొదలుగా పెరిగి విషకీటకాల బెడద ఎక్కువైదని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ అధికారులు ఈ గిరిజన కాలనీలోని ప్రజలు ఏ పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్నారని కనీస పరిశీలన కూడా చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమస్యలపై ఆ కాలనీ గిరిజనులతో కలిసి ఎమ్మార్వో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి డిప్యూటీ ఎమ్మార్వోకి అర్జీ సమర్పించారు. ఈ కార్యక్రమంలో చెంచు రెడ్డి, అంకమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం ముందు సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా

మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లాకు వినతి

ఎన్నో సంవత్సరాలుగా గిరిజనులు నివాసముంటున్నప్పటికీ.. వారికి ఇంటి పట్టాలు ఇవ్వలేదు. చిన్న చిన్న గుడిసెలలో రెండు కుటుంబాలు నివాసం ఉంటున్నారు. తుపాను నేపథ్యంలో గుడిసెలు దెబ్బతిని వారికి నష్టపరిహారం కూడా ఇంత వరకు అందలేదు. చాలా కుటుంబాల వారికి ఇప్పటికీ రేషన్ కార్డులు కూడా లేవు. అర్హులైన చాలా మందికి సామాజిక పెన్షన్లు కూడా అందడం లేదు. అధికారులు స్పందించి వెంటనే వీధి లైట్లు ఏర్పాటు చేయాలి. ఇళ్ల చుట్టుపక్కల పిచ్చి చెట్లను తొలగించాలి. అధికారులు స్పందించకపోతే గిరిజనులతో కలిసి పోరాటాలు చేపడతాం. - సీపీఎం నాయకులు శివకవి ముకుంద

ధనపాల్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ప్రతిపాదనతో పుత్తూరు మున్సిపాలిటీ చెందిన ఎస్.ఎస్. ధనపాల్ ఆంధ్రప్రదేశ్ మొదలియార్ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఆయనను పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, రూరల్ పార్టీ అధ్యక్షుడు అరవ బాలాజీ, తణుకు సింగల్ విండో చైర్మన్ కరుణ యాదవ్, పుత్తూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాబు నాయుడు, బిజెపి కోఆర్డినేటర్ ఈశ్వర్ యాదవ్‌లు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ప్రధాన కార్యదర్శి హేమంత్ కుమార్, మనోహర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నెల్లూరు ఎల్.ఐ.సి సంస్థలో ఏ.ఓ గా పనిచేస్తున్న దుర్గం రవికుమార్ దాతృత్వంలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నిరుపేద గర్భిణీలకు సోమవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చెంచులక్ష్మి మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక వారు గత 12 సంవత్సరాల నుండి భోజనాల పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. దాత దుర్గం రవికుమార్‌ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ షరీన్, జె.వి.వి. అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్, చెంచు నారాయణ, రామమోహన్, పురుషోత్తమరావు, రజనీకాంత్, ప్రభాకర్, సాయి, సురేష్, ఆస్పత్రి గ్యారేజ్ ఇంచార్జ్ తూపిలి రాగయ్య, శర్మ తదితరులు పాల్గొన్నారు.

అండర్ 19 క్రికెట్ జట్టుకు హేమంత్ ఎంపిక

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నేషనల్ అండర్-19 క్రికెట్ జట్టుకు పుత్తూరు శ్రీ వేద జూనియర్ కాలేజ్ విద్యార్థి కె.హేమంత్ సాయి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వేదవ్యాస విద్యాసంస్థల కరస్పాండెంట్ బాలసరస్వతి, డైరెక్టర్ వేదవ్యాస్, ప్రిన్సిపాల్ సనతకుమార్, భాజాఫిర్, అధ్యాపకులు హేమంత్ సాయిని సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, హేమంత్ సాయి సాధించిన విజయంతో కళాశాల పేరు మరింత ప్రఖ్యాతంగా నిలిచిందన్నారు. హేమంత్ సాయి ఎంపికపై కళాశాల విద్యార్థులు, సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు.

గ్రీవెన్స్ డేకు మూడు అర్జీలు

ప్రజాశక్తి -దొరవారిసత్రం : దొరవారిసత్రం మండలం, తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్ డేకు 3 అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ శైల కుమారి తెలిపారు. జనన ధ్రువ పత్రానికి 1, తహశీల్దార్ డిజిటల్ సంతకం కావాలని1, అసైన్మెంట్ పట్టా కోసం1 వచ్చినట్లు ఆమె తెలిపారు.

బ్లైండర్స్ ప్రైడ్ ఫ్యాషన్ టూర్ సిద్ధం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : బ్లైండర్స్ ప్రైడ్ ఫ్యాషన్ టూర్, దేశంలో ఫ్యాషన్‌కు అత్యంత నిర్వచనమైన ఈ స్వరం 2025లో మరోక మహత్తరమైన సంచికతో పునఃప్రవేశం చేస్తోందని పెర్నాడ్ రికర్డ్ ఇండియా సిఎండి డెబ్జిత్ దాస్ గుప్తా తెలిపారు. ఫ్యాషన్ టూర్ ను ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ "బ్లైండర్స్ ప్రైడ్ ఫ్యాషన్ టూర్, భారతదేశపు ఫ్యాషన్ అత్యంత చారిత్రాత్మక వేదికన్నారు. గ్రిడ్ ది ఐవర్ 'ద వన్ అండ్ ఓన్లీ' అనే మా ఆశయసాధన కోసం కృషి చేస్తూ, అత్యంత గుర్తింపు డిజైనర్లు, ఎఫ్‌డిసిఐల సహకారంతో, ఫ్యాషన్, స్టైల్ ఆవిర్భావానికి రూపకల్పన చేసే కొత్త కొలమానాలను కొనసాగిస్తామన్నారు. ఎఫ్ఓసి చైర్మన్ సునీల్ సేథీ మాట్లాడుతూ "బ్లెండర్స్ ప్రైడ్ ఫ్యాషన్ టూర్‌తో తన సహకార భాగస్వామ్యం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందని తెలిపారు. ఈ సంచిక వైవిధ్యభరితమైన డిజైన్ కల్పనలను ఒక తాటిపైకి తెస్తుందని తెలిపారు. వినియోగదారులు దీని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి - నాయుడుపేట : ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ నాయుడుపేట మండలంలోని పూడూరు గ్రామంలో నాయుడుపేట వైఎస్ఆర్‌సిపి కుతూరుగొండ ధనలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. తమ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు కూటమి ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తున్న కుట్రలను కోటి సంతకాలు పూర్తి చేయడం ద్వారా అడ్డుకుంటామని ఆయన తెలిపారు. అనంతరం గ్రామాల్లో వైసిపి నాయకులతో కలిసి పూడేరులో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట మండల వైఎస్ఆర్‌సిపి అధ్యక్షులు ఒబ్బూరు కిషోర్ యాదవ్, నాయుడుపేట పట్టణ వైసిపి అధ్యక్షులు కలికి మాధవరెడ్డి, నియోజకవర్గ వైసిపి మహిళ అధ్యక్షురాలు ఈదూరు ధనశ్రీ, అరవ పిరమిడ్ సర్పంచ్ శంకరయ్య, వైసిపి నాయకులు మధుసూదన్ రెడ్డి, బాలసుబ్రమణ్యం, భూపయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఒరిజినల్ నగలేనా : ఒవి రమణ

తిరుపతి సిటీ: తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామికి ప్రస్తుతం ఉన్నవి ఒరిజినల్ నగలేనా అని టిటిడి మాజీ పాలక మండలి సభ్యులు ఒవి రమణ అనుమానం వ్యక్తం చేశారు. తిరుపతిలోని ఆయన నివాసం వద్ద సోమవారం విలేకరులతో మాట్లాడుతూ టిటిడి చరిత్రలో ఎప్పుడు లేని విధంగా గత పాలకమండలిలో జరిగిన అక్రమాల పై వరుస విచారణలు జరుగుతుండటం శోచనీయమన్నారు. సిఐడి, సిబిఐ, సిట్ వంటి విచారణలో అనేక అక్రమాలు వెలుగు చూస్తున్నాయన్నారు. పరకామణి కేసు, కల్తీ నెయ్యి వ్యవహారం, శాలువల కొనుగోలు, భక్తులకు అన్నప్రసాదాలు పెట్టేందుకు వినియోగించే బియ్యం కొనుగోలులోనూ అక్రమాలు జరిగాయని తెలిపారు. టిటిడిలో భ్రష్టు పట్టించారని, ప్రతి విషయంలోనూ అక్రమాలు చోటు చేసుకున్నాయని, భక్తుల కానుకలు స్వామివారికి చేరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వరుసగా వెలుగు చూస్తున్న అక్రమాలను చూస్తుంటే, గర్భగుడిలోని స్వామివారి మూల విరాట్ కు ఉన్న నగలు ఒరిజినలేనా, గిల్టీవా అని అనుమానం వ్యక్తమవుతుందన్నారు. అందుకు అనుమానం లేకపోలేదని, గత పాలకమండలి సమయంలో ఓ భక్తుడు స్వామివారికి కానుకగా ఇచ్చిన బంగారు చెంబు విరాళం ఆరు నెలల తర్వాత ఆయన రిజిస్టర్‌లో నమోదయ్యిందని, అది కూడా మీడియా ప్రశ్నించడంతో హడావిడిగా నమోదు చేశారని గుర్తు చేశారు. తిరుమలకు గంజాయి సరఫరా చేసిన కరుణాకర్ రెడ్డి అని, అతని హయాంలో తిరుమల ఏపిపి వద్ద మూడున్నర కేజీల గంజాయి పట్టుబడిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. వెంకటేశ్వర స్వామి వారి సొమ్ము తిన్న వారు చట్టం నుంచి తప్పించుకోలేరని, వారికి శిక్ష తప్పదని హెచ్చరించారు.

అకౌంటింగ్ అనేది గుండె లాంటిది

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : అకౌంటింగ్ అనేది ప్రతి ఆర్థిక సంస్థకు గుండె లాంటిదని, సంస్థల ఆదాయ వ్యయాలను పారదర్శకంగా నిర్వహించి ఆర్థిక వ్యవస్థను అకౌంటెంట్లు స్థిరంగా ఉంచుతారని డాక్టర్ బి. చంద్రమౌళి పేర్కొన్నారు. నవంబర్ 10వ తేదీ, సోమవారం అంతర్జాతీయ అకౌంటింగ్ దినోత్సవం సందర్భంగా పుత్తూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కామర్స్ విభాగం ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ఈ సభలో చంద్రమౌళి మాట్లాడుతూ అకౌంటెంట్లు, ఆర్థిక వృత్తి నిపుణులు సమాజానికి ఎన్నో సేవలు అందిస్తున్నారన్నారు. అకౌంటెంట్లు పారదర్శకంగా, నిబద్ధతతో నిర్వహించడం ద్వారా దేశ ఆర్థిక అభివృద్ధికి తోడ్పడతారని, వీరి సేవలు వెలకట్టలేనివని తెలిపారు. డిగ్రీ తర్వాత విద్యార్థులు అకౌంటింగ్ రంగంలో ఉద్యోగ అవకాశాలు ఉంటాయని, ఆ రంగంలో చేయవలసిన కోర్సుల వివరాలను కామర్స్ శాఖ అధ్యక్షులు డాక్టర్ ఏ. దేవకి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు క్విజ్, ఉపన్యాసం పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఏ.దేవకీ, డాక్టర్ వి.వాసవి, డాక్టర్ జి.తిరుమలయ్య, డాక్టర్ కే.శ్రీనివాసులు, లక్ష్మీబాయి, జ్యోతి తదితర అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

సాధారణ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - వాకాడు: వాకాడు మండలం, స్త్రీ శక్తి భవనంలో సోమవారం ఎంపీడీవో సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో, ఎంపీపీ కొడవలూరు అనసూయమ్మ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అన్ని శాఖల అధికారులు పాల్గొని, తమ కార్యకలాపాలను సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు వివరించారు. జడ్పిటిసి రైతు రామకృష్ణ మాట్లాడుతూ ఎన్ఆర్జిఎస్ లో జరుగుతున్న అవినీతి గురించి ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న గోకులం షెడ్లను పక్కతోవ పట్టిస్తున్నారని, ప్రభుత్వ సొమ్మును వృధా చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. సర్పంచులు మాట్లాడుతూ విద్యుత్ శాఖలో సంవత్సరాల తరబడి సమస్యలు పేరుకుపోతున్నాయని ట్రాన్స్ఫార్మర్లు, విద్యుత్తు లైన్ల విషయంలో తలెత్తే సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లైన్ మాన్‌లు, జూనియర్ లైన్ మాన్‌లు పనితీరును మార్చుకోవాలని, అధికారులు విద్యుత్ సమస్యలు తీర్చాలని కోరుతున్నారని తెలిపారు. నిరుపేద ఎస్సీలు, ఎస్టీలకు యూరియా పంపిణీ చేయాలని కోరారు. ఎంపీడీవో సాయి ప్రసాద్, ఎమ్మార్వో సయ్యద్ ఇక్బాల్‌లు ఈ విషయాలను పరిశీలించి, సంబంధిత అధికారుల ద్వారా పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం సమావేశానికి విచ్చేసిన నూతన ఏఎంసి చైర్మన్ దారా ప్రమీలమ్మను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు రౌతు రామకృష్ణ, ఎంపీపీ సలహాదారు కొడవలూరు దామోదర్ రెడ్డి, సర్పంచుల సంఘ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, వివిధ శాఖల మండల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

ఘనంగా బ్రౌన్ జయంతి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: తెలుగు భాషా వ్యాప్తికి తన వంతు కృషి చేసిన ఆంగ్లేయుడు సి.పి.బ్రౌన్ జయంతిని పురస్కరించుకుని మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు వాణి బ్రౌన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖ ఆధ్వర్యంలో ప్రాచీన తెలుగు భాషకు గ్రంథస్థం చేసి ఒక రూపం తీసుకువచ్చిన పరిశోధకుడు సిపి బ్రౌన్ 227 వ జయంతిని తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య కొలకలూరి మధుజ్యోతి విభాగంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రౌన్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆయన తెలుగు భాషకు చేసిన సేవలను కొనియాడారు.

విద్యుత్ సౌకర్యం కల్పించండి

ప్రజాశక్తి - నాగలాపురం: ఎస్సీ, ఎస్టీ కాలనీలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నాగలాపురం, విద్యుత్ శాఖ ఏడిఈ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి జనార్ధన్, సత్యవేడు ప్రాంతీయ కార్యదర్శి మెలుగు రమేష్‌లు మాట్లాడుతూ సత్యవేడు, పేరడం గిరిజన కాలనీలోని నివాసమున్న 40 కుటుంబాల యానాదులు ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకొని 4 సంవత్సరాలుగా నివాసం ఉంటున్నప్పటికీ విద్యుత్ సౌకర్యం కల్పించలేదన్నారు. రాత్రుళ్లు పాములు, దోమల బెడదతో, తాగడానికి నీరు లేకుండా అగచాట్లు పడుతుంటే అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. మండల కేంద్రమైన నాగలాపురంలో దళితులు గత 13 సంవత్సరాలుగా పోరాటం చేసి విద్యుత్ సబ్‌స్టేషన్ పక్కనున్న ప్రభుత్వ భూమిలో వంద మంది ఇల్లు కట్టుకొని నివాసం ఉంటే ఇంతవరకు విద్యుత్ సౌకర్యం, సాగునీటి సౌకర్యం కల్పించలేదన్నారు. తక్షణమే అధికారులు జోక్యం చేసుకొని ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు కింద పేరడం గిరిజన కాలనీకి, నాగలాపురం సుందరయ్య కాలనీకి విద్యుత్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారులకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కృష్ణయ్య, మురళి, పేరడం గిరిజనులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ అధికారులకు వినతి పత్రం

యూరియా పంపిణీ

ప్రజాశక్తి - బాలాయపల్లి: రైతులు యూరియా కోసం అధైర్య పడాల్సిన అవసరం లేదని వ్యవసాయశాఖ ఎడిఎ అనసూయ తెలిపారు. సోమవారం మండలంలోని నిడిగల్లు సొసైటీ అధ్యక్షులు ఆది వెంకటకృష్ణ రెడ్డి ఆధ్వ ర్యంలో నిడిగల్లు సొసైటీలో యూరియా పంపిణీ చేశా రు. సొసైటీ అధ్యక్షులు వెంకట కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సహకారంతో యూరియా కొరత లేకుండా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసా య శాఖ అధికారిణి విజయలక్ష్మి, సొసైటీ సబ్యులు రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు.

స్వామిత్వతో నివేశ స్థలాలకు హక్కు పత్రాలు

ప్రజాశక్తి - బాలాయపల్లి : గ్రామాల్లోని ప్రజలకు వారి నివేశ స్థలాలకు హక్కులు కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వమిత్వ కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టడం జరిగిందని డిడిఓ వాణిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని హస్తకావేరి, అరిగేపల్లి గ్రామాల్లో ఎంపిడిఓ నారాయణ ఆధ్వర్యంలో, వెంగమాంబపురం, అక్కసముద్రం గ్రామాల్లో డిప్యూటీ ఎంపీడీఓ రామకృష్ణ ఆధ్వర్యంలో స్వమిత్వ గ్రామసభలు నిర్వహించారు. వెంగమాంబపురంలో జరిగిన గ్రామ సభలో డిడిఓ వాణిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ గ్రామాల్లోని నివాసాలకు సర్వే నిర్వహించి గ్రామ కంఠం స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని ఉన్న లబ్దిదారులకు మొదటగా హక్కు పత్రాలు కల్పించేందుకు, వారి అభ్యంతరాలు తెలుసుకునేందుకు స్వమిత్వ(9)2 నోటీసు అందజేయడం జరుగుతందన్నారు. నోటీసుల ప్రక్రియ ముగిశాక లబ్దిదారులకు హక్కుపత్రాలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బి వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

జనార్ధన్ రెడ్డికి గౌరవ పురస్కారం

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు: గౌరవప్రదమైన ఉపాధ్యాయ వృత్తిని చేస్తూ సమాజం పట్ల తనకున్న విజ్ఞానంతో జర్నలిజంలో పట్టా పొంది తనదైన శైలిలో వార్తలు రాస్తున్న స్థానిక భాకరాపేట శ్రీ సాయిరాం స్కూల్ కరెస్పాండంట్ జనార్దన్ రెడ్డికి తెలంగాణ పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో తారకరామా స్టేడియంలో మాజి తెలంగాణ స్పీకర్ మధుసూదనాచార్య, గ్రంథాలయ చైర్మన్ రియాజ్, జబర్దస్త్ ఫేమ్ నూకరాజు చేతుల మీదుగా సౌత్ ఇండియా అవార్డ్స్ మోక్షి గ్లోబల్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో గౌరవ సన్మానం, క్రాంతి పురస్కార్ అవార్డును అందుకున్నారు. ఉపాధ్యాయులు, స్థానికులు ఆయనను అభినందించారు.

క్యూలైన్లు ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్‌తో అనుసంధానం

ప్రజాశక్తి - తిరుమల: తిరుమలలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్ లో ఉన్న ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పై సోమవారం ఉదయం టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి సీవీఎస్వో మురళీకష్ణతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. దర్శన క్యూలైన్ల నిర్వహణను మరింత పటిష్టం చేసేందుకు వైకుంఠం క్యూ కాంప్లెక్స్, నారాయణగిరి షెడ్లు, లోపల, బయట క్యూలైన్లలోని సీసీ కెమెరాలను ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ తో అనుసంధానం చేయాలని ఆదేశించారు. విజిలెన్స్, వైకుంఠం, ఆలయ సిబ్బంది క్యూలైన్ లో భక్తుల సంఖ్య, కదలికలపై గణాంకాలను ఎప్పటికప్పుడు విశ్లేషించి నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ఇందుకు ఐటీ విభాగానికి కావాల్సిన అన్ని సదుపాయాలను కల్పించాలని ఆదేశించారు. కార్య ఫౌండేషన్ ఇప్పుడున్న సాఫ్ట్ వేర్ ను రివ్యూ చేసి మరింత అభివద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇందుకు ఆ సంస్థకు కావాల్సిన పూర్తి సమాచారాన్ని ఎప్పటికప్పుడు వైకుంఠం, విజిలెన్స్ సిబ్బంది అందించాలని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పై ప్రతివారం సమీక్ష నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఐటీ జీఎం ఫణి కుమార్ నాయుడు, డిప్యూటీ ఈవో లోకనాథం, వీజీవోలు రామ్ కుమార్, సురేంద్ర, డిప్యూటీ జనరల్ మేనేజర్ (ఐ.టి) వెంకటేశ్వర నాయుడు , కార్య ఫౌండేషన్ సంస్థ ప్రతినిధులు జయ ప్రసాద్, రవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'డయల్ యువర్ సిఎండి'కి విశేష స్పందన

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. ఏపీ ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి 76 మంది వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను సిఎండి దష్టికి తీసుకువచ్చారు. సిఎండి శివశంకర్ లోతేటి సమాధానమిస్తూ వినియోగదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గత సోమవారం నిర్వహించిన డయల్ యువర్ సీఎండి కార్యక్రమం ద్వారా నమోదైన 87 సమస్యల్లో 62 సమస్యలను ఇప్పటికే పరిష్కరించినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ఐటి) పి. అయూబ్ ఖాన్, డైరెక్టర్ (టెక్నికల్ అండ్ హెచ్‌ఆర్ డి) కె. గురవయ్య పాల్గొన్నారు.

వినియోగదారులు ఫిర్యాదు పై స్పందన

డయల్ ఎస్పీడీసీఎల్ సిఎండి కార్యక్రమంలో గతవారం వినియోగదారులు చేసిన ఫిర్యాదు పై తిరుపతి అర్బన్ ఆపరేషన్ ఈఈ గంగాధరం స్పందించి, వెనువెంటనే సమస్యలు పరిష్కరించడంతో వినియోగదారులు వర్షం వ్యక్తం చేశారు. ఈనెల మూడవ తేదీ మొదటిసారిగా ఎస్పీడీసీఎల్ సీఎండీ నిర్వహించిన డయల్ యువర్ సిఎండి కార్యక్రమంలో దామినేడు సెక్షన్ పరిధిలో ఓ అపార్ట్మెంట్ ముందు భారీ చెట్టు మధ్యలో విద్యుత్ లైన్లు వెళ్తుండడంతో, కరెంట్ షాక్ కొడుతుందని స్థానికులు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఈఈ గంగాధరం సిబ్బందిని అప్రమత్తం చేసి, ఆ సమస్యలను పరిష్కరించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

14న కార్తీక దీపోత్సవం

ప్రజాశక్తి - తిరుపతి సిటి : కార్తీక మాసాన్ని పురస్కరించుకుని టిటిడి ఆధ్వర్యంలో నవంబరు 14వ తేదీన తిరుపతిలోని టిటిడి పరిపాలనా భవనం మైదానంలో కార్తీక దీపోత్సవం జరగనుంది. సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు జరగనున్న ఈ కార్యక్రమాన్ని శ్రీ వెంకటేశ్వర భక్తి ఛానల్ ప్రత్యక్ష ప్రసారం చేయనుంది. ఇందుకోసం పరిపాలన మైదానంలో కార్తీక దీపోత్సవాలు నిర్వహించేందుకు టిటిడి విస్తత ఏర్పాట్లు చేపడుతోంది.

క్రైం న్యూస్

మోటార్ సైకిల్‌ను ఢీకొట్టిన బస్సు.. యువకుడు మృతి

ప్రజాశక్తి - నాయుడుపేట: బస్సు, మోటార్ సైకిల్ ఢీకొన్న ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన నాయుడుపేట మినీ బైపాస్ లోని కేకే కళ్యాణమండపం వద్ద సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. నాయుడుపేట మండలం, మేనకూరు పరిశ్రమల్లోని బ్రేక్స్ ఇండియా కంపెనీకి చెందిన బస్సు మితిమీరిన వేగం ఒక వ్యక్తి ప్రాణాలను తీసింది. పెళ్లకూరు మండలం అర్ధమాల గ్రామానికి చెందిన వేనాటి శివ అనే వ్యక్తి, నాయుడుపేట మండలం చిలమత్తూరు గ్రామానికి చెందిన గోనుపల్లి శ్రావణి సోమవారం సాయంత్రం పెళ్లకూరు నుండి నాయుడుపేటకు మోటార్ సైకిల్ పై వస్తుండగా మేనకూరు పరిశ్రమలోని బ్రేక్స్ ఇండియా కంపెనీకి చెందిన బస్సు కేకే కళ్యాణమండపం వద్ద ఢీకొనడంతో శివ అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, శ్రావణికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకి, అంబులెన్స్‌కి సమాచారం అందించగా, గాయపడ్డ శ్రావణిని చికిత్స నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ నుండి మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదం జరిగిన తర్వాత బస్సు డ్రైవరు, బస్సును అక్కడే వదిలి పోలీసులు రాకముందే పారిపోయాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పాత కక్షల నేపథ్యంలోనే హత్య

వివరాలు వెల్లడిస్తున్న అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి

ప్రజాశక్తి రేణిగుంట: పాత కక్షలు నేపథ్యంలోనే కొండూరు మనోజ్ (46) హత్యకు గురయ్యాడని తిరుపతి లా అండ్ ఆర్డర్ అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి తెలిపారు. సోమవారం రేణిగుంట సబ్ డివిజనల్ పరిధిలోని గాజులమండ్యం పోలీస్ స్టేషన్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాత ఈనాడు కార్యాలయం వెనకాల ఉన్న లక్ష్మీ నగర్ సమీపంలోని పాడుబడిన భవనంలో తీవ్రమైన దుర్వాసన వస్తుండటంపై వచ్చిన ఫిర్యాదు ఆధారంగా గాజులమండ్యం పోలీసులు పరిశీలించారు. ఆ భవనంలో ఉన్న నీటి సంపులో చేతులు, కాళ్లు కట్టిన మృతదేహం బయటపడిందన్నారు. క్లూస్ టీమ్ గుర్తింపులో మృతుడు రేణిగుంటకు చెందిన కొండూరు మనోజ్ (44) అని తేలిందన్నారు. దర్యాప్తులో మృతుడు మనోజ్‌కు పాత క్రిమినల్ కేసుల్లో భాగస్వామి అయిన హరిప్రసాద్ (ఏ-1) తో వివాదాలున్నాయన్నారు. మనోజ్ తరచూ హరిప్రసాద్‌ను అవమానించడం అతడి భార్యపై వ్యాఖ్యలు చేయడమే ఈ హత్యకు కారణమని పోలీసులు నిర్ధారించారు. నవంబర్ 2న హరిప్రసాద్ తన తమ్ముడు సుధాకర్ (ఏ-2), స్నేహితుడు శ్యామ్‌సన్ (ఏ-3) సహకారంతో మనోజ్‌ను ఊపిరాడనివ్వకుండా హత్య చేసి మృతదేహాన్ని సంపులో పడేశారని దర్యాప్తులో బయటపడిందన్నారు. నవంబర్ 10న విశ్వసనీయ సమాచారం ఆధారంగా రేణిగుంట సీఐ మంజునాథ్ రెడ్డి బృందం కడప-రేణిగుంట రోడ్డుపై ఈ ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కేసు పరిశోధనను డీఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షించగా, తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు ఆదేశాలపై పోలీసు బృందం పని చేసిందన్నారు. కేవలం నాలుగు రోజుల్లోనే కేసు చేధించినందుకు ఎస్పీ సుబ్బరాయుడు దర్యాప్తు బృందాన్ని అభినందించి రివార్డులు ప్రకటించారు. ముద్దాయిలను రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు. ఈ మీడియా సమావేశంలో గాజులమండ్యం ఎస్సై సుధాకర్, పి ఎస్ ఐ ప్రవళిక, స్టేషన్ కానిస్టేబుల్ మణి, ఐడి పార్టీ కానిస్టేబుల్ రాజశేఖర్, బారుషా, గాజులమండ్యం పోలీస్ స్టేషన్ పోలీసుల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 36 వినతులు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 36 వినతులు వచ్చాయని డిప్యూటీ కమిషనర్ అమరయ్య తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 24 మంది కార్యాలయానికి నేరుగా వచ్చి వినతులు సమర్పించగా, 12 మంది ఫోన్ ద్వారా తమ సమస్యలు తెలిపారు. వినాయక నిమజ్జనం అనంతరం మిగిలిన విగ్రహాలు, వ్యర్థాలు తొలగించాలని, భూగర్భ డ్రైనేజి పొంగి పొర్లుతున్నది పరిష్కరించాలని, ఎన్.జి.వో. కాలనీ లో చెట్లు పెరిగి పాముల బెడద ఎక్కువగా ఉందని, బండారు కాలనిలో మా ఇంటి వద్ద ఏర్పాటు చేసిన గార్బేజ్ పాయింట్ తొలగించాలని, చింతల చేను, ఎరుకుల కాలనీ స్మశానవాటికకు ప్రహరీ గోడ నిర్మించాలని, హథీరాంజీ కాలనీ నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాలను ఆపాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ ఉన్నారు.

యూరియా పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రతి రైతుకు రబీ సీజన్లో యూరియా అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తిరుపతి పార్లమెంట్ తెలుగు మహిళ జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి పేర్కొన్నారు. గూడూరు మండల పరిధిలోని చెన్నూరు రైతులకు సోమవారం యూరియా పంపిణీ చేశారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 266 అర్జీలు

కలెక్టరేట్ వద్ద ఆత్మహత్యాయత్నం చేస్తే కేసులు తప్పవు : కలెక్టర్ వెంకటేశ్వర్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): జిల్లా నలుమూలల నుండి సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రతి అర్జీదారుడుకి జిల్లా కలెక్టర్ పరిధిలో ఉంటే తప్పక న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని, అలా కాదని న్యాయస్థానాలలో నలుగుతున్న వివాదాలకు పరిష్కారాలు జిల్లా కలెక్టరేట్లో చేయలేమని, అర్జీదారులు గమనించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ సూచించారు. గడిచిన నాలుగు నెలల కాలంగా ప్రతి వారం కోర్టు పరిధిలో ఉన్న భూ వివాదానికి, అన్నదమ్ముల మధ్య నలుగుతున్న కేసుకు సంబంధించి పరిష్కారం చూపాలని కెవిబి పురం మండలానికి సంబంధించిన వీరాస్వామి, ఆయన కుమారుడు అర్జీలు ఇస్తూ సోమవారం పిజిఆర్ఎస్ కార్యక్రమానికి కలెక్టరేట్ వద్దకు వచ్చి పెట్రోల్ పోసుకోవడానికి ప్రయత్నించడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రయత్నాలు చేయడం వలన పరిష్కారం అయిపోతుందా, కోర్టు పరిధిలో ఉన్న సమస్యలు తానెలా పరిష్కరించగలనని చెప్పినా వినిపించుకోకుండా వాదనలకు దిగారు. దీనిపై ఇటువంటి చర్యలు పునరావృత్తం కాకుండా కేసులు నమోదు చేసేలా కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లా నలుమూలల నుండి పరిష్కారం కోసం జిల్లా కలెక్టరేట్లో నిర్వహించి ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి అర్జీదారుడుకి గడువులోపు నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్లో పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ట్రైని కలెక్టర్ సందీప్ రఘువాన్షి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేందర్ రెడ్డి, రోజ్ మాండ్, సుధారాణిలతో కలిసి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. రెవిన్యూ శాఖకు సంబంధించి 169 అర్జీలు రాగా, సర్వే శాఖ 10, పోలీస్ శాఖ 18, పంచాయతీరాజ్ 13 ఇలా 266 అర్జీలు వివిధ శాఖలకు సంబంధించి వచ్చాయని అధికారులు ప్రకటించారు.

వందేళ్ళ స్మశానాన్ని కాపాడండి

తిరుపతి-కరకంబాడి మార్గంలోని తిమ్మి నాయుడు పాలెం హరిజనవాడకు సంబంధించి వందేళ్లుగా స్మశానం ఉందని, కానీ ఇటీవల కొంతమంది ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నువ్వు కలసి అటవీ భూమిలో స్మశాన వాటిక ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరడం విడ్డూరంగా ఉంది. కొంతమంది గతంలో స్మశానానికి వినియోగించుకుంటున్న స్థలాన్ని దుర్వినియోగం చేస్తూ ఇల్లు నిర్మించుకున్నారని, వందేళ్లుగా స్మశాన వాటికగా ఉపయోగించుకుంటున్న స్థలాన్ని కాపాడాలని జిల్లా కలెక్టర్ను కోరుతున్నాం.

-భోకం అనిల్ కుమార్, 50వ డివిజన్ కార్పొరేటర్, తిరుపతి నగరపాలక సంస్థ

మాకు బండి బాట దారి కల్పించండి

తిరుపతి జిల్లా ఎర్రావారిపాలెం మండలం చెరుకు వారి పల్లి గ్రామానికి చెందిన ప్రజలకు అవసరాల నిమిత్తం బండి బాట దారిని కల్పించాలి. చెరుకువారిపల్లి గ్రామ లెక్క దాఖల సర్వే నెంబర్లు 1828/2ఏ,2బి లలో దాదాపు పది ఎకరాల పొలం ఉంది. తాత ముత్తాతల కాలం నుంచి మా పొలం వద్దకు ప్రభుత్వ భూమిలో బండి బాట సౌకర్యం ఉండేది. ఆ గ్రామానికి సంబంధించిన చంగల్రాయల్ రెడ్డి బండి బాటను పూర్తిగా పూడ్చివేసి రాత్రికి రాత్రే చెట్లు నాటాడు. ఎన్నో ఏళ్లుగా బండిబాటగా వినియోగించే స్థలంలో తెల్లవారే సరికి చెట్లు ఉండడాన్ని చూసి గ్రామ ప్రజలంతా ఆశ్చర్యపోయారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశాము. పోలీసులు చెప్పిన వినిపించుకోకుండా మాపై దౌర్జన్యానికి పాల్పడుతూ చంపుతామని బెదిరిస్తున్నారు. చంగల్ రెడ్డి కుటుంబ సభ్యుల వలన తమ కుటుంబానికి ప్రాణహాని ఉంది. దీనిపై జిల్లా కలెక్టర్ గా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము.

- నాగరాజు, బాధితుడు, ఎర్రావారిపాలెం మండలం

అటవీ అధికారుల నుండి మా భూములను కాపాడండి

అటవీ శాఖ అధికారుల నుండి దళితుల భూములను కాపాడాలి. నారాయణవనం మండలం, కాశీగరం రెవెన్యూ పరిధికి చెందిన వ్యక్తుల తడుకు గ్రామంలో దళితవాడ ప్రజలు 1970 సంవత్సరం నుండి 39/1, 39/2, 41/1, 42/1, 42/2, 43/3 సర్వే నంబర్లలో గల 100 ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్నామని, ఈ భూములకు సంబంధించి కలెక్టర్ స్పందించి పాస్ బుక్ లను మంజూరు చేస్తూ, అటవీ అధికారుల జోక్యాన్ని శాశ్వతంగా నివారించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

-తిరుపతి శ్రీనివాసులు, గ్రామస్తులు

పరిశ్రమల అభివృద్ధి కమిటీ సభ్యులుగా మురళీమోహన్

ప్రజాశక్తి - రామచంద్రాపురం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య స్థాయి పరిశ్రమల అభివృద్ధి కమిటీ సభ్యులుగా రామ చంద్రపురం మండలం, కమ్మపల్లికి చెందిన చిత్తూరు పార్లమెంటరీ నియోజకవర్గం టిడిపి అధికార ప్రతినిధి చిన్న బాబు (మురళీమోహన్)ను ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మురళీమోహన్ అందించిన సేవలకు గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వం ఈ నియామకాన్ని చేపట్టిందని పలువురు అభిప్రాయ పడ్డారు. ఈ సందర్భంగా మురళీమోహన్ మాట్లాడుతూ టీడీపీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. మురళీమోహన్ నియామకం పట్ల మండల కూటమి పార్టీల నాయకులు, పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఎంబియులో పెన్ స్టేట్ యూనివర్సిటీ ప్రతినిధుల బృందం

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి మండలం, రంగంపేట మోహన్ బాబు యూనివర్సిటీని, సోమవారం పెన్ స్టేట్ యూనివర్సిటీ ప్రతినిధుల బృందం సందర్శించారు. ఈ సందర్శనలో విద్యార్థులు, అధ్యాపకుల మార్పిడి కోసం కొత్త చొరవలను చర్చిస్తూ, రెండు విశ్వవిద్యాలయాల మధ్య సహకార సంబంధాలను మరింత బలోపేతం చేశారు. ఈ కార్యక్రమంలో యంబియు నుండి ఉపకులపతి ప్రొ. నాగరాజ్ రామరావు, రిజిస్ట్రార్ డా. సారథి, డీన్ అకాడెమిక్స్ డా. రమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్వీయూలో ర్యాగింగ్ వ్యతిరేక అవగాహన

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో మంగళవారం ర్యాగింగ్ వ్యతిరేక అవగాహన కార్యక్రమం వర్సిటీ స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చర్ అఫైర్స్ విభాగం ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివేక్ వెల్లడించారు. ఇందుకు సంబంధించిన గోడ పత్రికను తిరుపతి ఎస్వీ సుబ్బరాయుడు సోమవారం ఆవిష్కరించారు. మంగళవారం ఉదయం 11 గంటలకు ఎస్వీయూ శ్రీనివాసా ఆడిటోరియంలో నిర్వహించే ర్యాగింగ్ వ్యతిరేక అవగాహన కార్యక్రమంలో ఎస్పీ సుబ్బరాయుడు, వర్సిటీ వీసీ నర్సింగరావు, రెక్టార్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చర్ అఫైర్స్ డైరెక్టర్ డీన్ మురళీధర్, కో-ఆర్డినేటర్ పత్తిపాటి వివేక్ పాల్గొంటారని ఒక ప్రకటనలో తెలిపారు.

ఎస్వీయూ ఉద్యోగి తాళపత్ర గ్రంథాల రచన

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో లీగల్ సెల్ ఏఓ గా పనిచేస్తున్న వి.రాఘవేంద్ర రావు అమూల్య తాళపత్ర గ్రంథాలను స్వయంగా రాశారు. సహజంగా జ్యోతిష్యంలో నిపుణులైన ఆయన గతంలో ఎస్వీయూ ప్రాచ్య పరిశోధన సంస్థలో పనిచేసేవారు. ఆయన రాసిన రెండు తాళపత్ర గ్రంథాలను ఎస్వీయూ ఓఆర్ఐ కి బహూకరించారు. సంస్థ సంచాలకులు ఆచార్య పి.సి. వెంకటేశ్వర్లుకు కార్యాలయంలో వాటిని అందజేశారు. ఈ తాళపత్ర గ్రంథాలలో "గౌతమ సంహిత" అనే జైమిని మహర్షి రాసిన జ్యోతిష్యానికి వేలూరి సుబ్రమణ్య శాస్త్రి తెలుగులో రాసిన వ్యాఖ్యను, మరలా తాళపత్ర రూపంలోకి తెచ్చారు. శ్రీ సింగరాచార్య రాసిన "జాతకరాజీయము" గ్రంథానికి కొంపెల్ల నరసింహశాస్త్రి రాసిన తెలుగు వ్యాఖ్యానాన్ని ఆంగ్లంలోకి తర్జుమా చేసి తాళపత్ర గ్రంథంలో రాశారు. అంటే ఈ గ్రంథం తెలుగు, ఆంగ్లంలో వుంటుంది. ఈ కాలంలో తాళపత్ర గ్రంథాలను రాసిన రాఘవేంద్రరావును సంస్థలోని సిబ్బంది అభినందించారు. వారు ఇచ్చిన తాళపత్ర గ్రంథాలను జాగ్రత్తగా భద్రపరిచారు.

జగన్ మహా పాపానికి ఒడిగట్టాడు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: వెంకన్న లడ్డూ తయారీకి సరఫరా చేసిన నెయ్యిలో రసాయనాలు ఉన్నాయని సిట్ తేల్చిందని, ఆ పాపం జగన్‌దేనని టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఉమేష్ రావు పేర్కొన్నారు. భక్తులు పరమ పవిత్రంగా భావించే తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి కలిపి జగన్ మహా పాపానికి ఒడిగట్టాడని సోమవారం మండిపడ్డారు. బాబాయ్ సుబ్బారెడ్డికి వెంకన్న సొమ్మును దోచిపెట్టడానికి జగన్ ఆ పాపాన్ని చూస్తూ ఊరుకున్నాడంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. పలువురు బీసీ విభాగం నేతలు పాల్గొన్నారు.

పేదలకు వైద్య విద్య దూరం

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు : వైద్య కళాశాలలను ప్రయివేటీకరించడం అంటే పేదలకు విద్య, వైద్యం దూరం చేయడమేనని చిన్నగొట్టిగల్లు మండల వైసీపీ అధ్యక్షుడు సింహాల మోహ న పేర్కొన్నారు. సోమవారం చిన్నగొట్టిగల్లు మండల కేంద్రంలో కోటి సంతకాల ఉద్య మం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమంగా సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భాస్కర్ రెడ్డి, మండల వైఎస్సార్ సీపీ మైనారిటీ విభాగం అధ్యక్షుడు బావాజీ, డివిజన్ నాయకుడు అక్బర్, షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్‌సీపీ 'ప్రజా ఉద్యమం' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: చంద్రబాబు ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ప్రజా ఉద్యమంలో భాగంగా ఈనెల12వ తేదీన అన్ని నియోజక వర్గ కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు చంద్రగిరి నియోజకవర్గంలో చేపట్టే ప్రజా ఉద్యమానికి సంబంధించిన భారీ ర్యాలీ పోస్టర్లను సోమవారం ఆ పార్టీ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆవిష్కరించారు. తిరుపతి రూరల్ మండలం, తుమ్మలగుంట, చంద్రగిరి నియోజకవర్గం పార్టీ కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ అన్ని గ్రామాల్లో కోటి సంతకాల సేకరణ చేపట్టడం జరిగిందని, పార్టీ శ్రేణులు అందులో బిజీగా వున్నప్పటికీ 12వ తేదీన జరిగే ర్యాలీని విజయవంతం చేయాలన్నారు. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి వచ్చే ఆదేశాలను ప్రతి ఒక్కరు పాటించాలని, క్షేత్ర స్థాయి నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు వాటిని అనుసరించాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడం వల్ల కలిగే నష్టాలు, ఆ మెడికల్ కాలేజీలకు అనుబంధంగా వచ్చే ప్రభుత్వ ఆసుపత్రులు దూరమైతే ప్రజలకు వైద్యం అందకుండా పోతుందన్న నిజాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. ప్రభుత్వ కమీషన్లకు కక్కుర్తిపడి ఇలా ప్రభుత్వ నిధులతో కట్టించిన మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేస్తోందని విమర్శించారు. ఆ నిర్ణయాన్ని అమలు పరచకుండా చేయడం కోసం రాజ్యంగా బద్ధమైన పదవిలో వున్న గవర్నర్‌కు ఫిర్యాదు చేయడానికి జగనన్న కోటి సంతకాల ప్రజా ఉద్యమానికి పిలుపునిచ్చారన్నారు. కావున ఆ ప్రజాఉద్యమంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. అనంతరం రాష్ట్ర వైఎస్ఆర్‌సీపీ విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డితో కలిసి ర్యాలీ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి రూరల్, చంద్రగిరి, రామచంద్రాపురం మండలాలకు చెందిన పార్టీ ముఖ్యనేతలు పాల్గొన్నారు.

పార్క్, ఈట్ స్ట్రీట్‌ల నిర్మాణానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి - చంద్రగిరి: తిరుపతి నగరానికి అతి సమీపంలో ఉన్న చంద్రగిరిలో పార్క్, ఈట్ స్ట్రీట్‌లకు స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే పులివర్తి నాని స్థలం పరిశీలించారు. రాయలపురం పంచాయతీ జాతీయరహదారిని ఆనుకొని నాగాలమ్మ మలుపు వద్ద వున్న స్థలం పరిశీలించి, చేపట్టాల్సిన పనులు గురించి సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే తెలిపారు. పిల్లలకు ఆటవిడుపు, పెద్దలకు సాయంత్రం సమయంలో విశ్రాంతి, జాతీయ రహదారిలో ప్రయాణించే వాహనదారులకు భోజనాలు చేయడానికి ఈట్ స్ట్రీట్ ఏర్పాటుకు అనుగుణంగా ఉండే విధంగా మ్యాప్ సిద్ధం చేయాలని అధికారులకు ఎమ్మెల్యే తెలిపారు.

భక్తుల మనోభావాలను కాపాడండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తిలో భక్తుల మనోభావాలను కాపాడేలా శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం తరపున కార్యాచరణ చేపట్టాలని జనసేన నాయకులు ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్‌కు విజ్ఞప్తి చేశారు. జనసేన నాయకులు సోమవారం ధర్మకర్తల మండలి చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో పలుచోట్ల ఉన్న దేవస్థానం ఆర్చిలకు రాజకీయ బ్యానర్‌లు కట్టడం వల్ల భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయని వివరించారు. వాటి వల్ల ట్రాఫిక్ సమస్య కూడా తలెత్తుతోందని తెలిపారు. ఏపీ సీడ్స్ సర్కిల్ నుంచి అమర జ్యోతి కళ్యాణ మండపం వరకు డివైడర్ పై ఏర్పాటు చేసిన నంది స్తంభాలకు మైకులు అమర్చి శివనామస్మరణలు మారోగేలా చేయాలని విజ్ఞప్తి చేశారు.

పవన్ పర్యటన హాస్యాస్పదం : భూమన

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో రెండు రోజులు చేసిన పర్యటన హాస్యాస్పదంగా ఉందని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ఎద్దేవా చేశారు. పద్మావతి పురంలోని ఆయన నివాసం వద్ద కరుణాకర్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ప్రజా సొమ్ముతో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తిరుపతి, చిత్తూరు జిల్లాలో పర్యటించారని, ఆయన పర్యటన అద్యంతం ఎక్కే విమానం దిగే విమానంగా సాగిందన్నారు. ఒక రాత్రి ఆయన తినే ఆహారం తిరుపతిలో దొరకదా, ఆయన బస చేసేందుకు తిరుపతిలో అవసరమైన సౌకర్యాలు లేవా అని ప్రశ్నించారు. కేవలం రాత్రి డిన్నర్ కోసం ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు వెళ్లడం విడ్డూరమన్నారు. దట్టమైన శేషాచల అడవుల్లో మొక్కలు నాటడం నవ్వు తెప్పిస్తుందన్నారు. అటవీశాఖపై ఆయనకు అవగాహన లేదనడానికి రెండు రోజులు పర్యటనే నిదర్శనమని విమర్శించారు.

డప్పు కళాకారులను ఆదుకోండి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ :డప్పు కళాకారులను ప్రభుత్వం ప్రోత్సహించాలని లేనియెడల భవిష్యత్తులో డప్పు కళ పూర్తిగా అంతరించిపోతుందని ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం నాయకులు సంక్రాంతి వెంకటయ్య వెల్లడించారు. గూడూరు పట్టణంలోని సిపిఎం పార్టీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం గూడూరు మహాసభ నిర్వహించారు. డప్పు వాయిద్యం గొప్పతనాన్ని తెలియజేస్తూ గీతాలను ఆల పించారు. సంక్రాంతి వెంకటయ్య మాట్లాడుతూ డప్పు కళాకారులకు భూములు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనంతరం సిపిఎం కార్యాలయం నుండి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు డప్పులు వాయిస్తూ ర్యాలీ చేపట్టి, వినతి పత్రం అందచేశారు. ఈ సమావేశంలో కె.వి.పి.ఎస్ నాయకులు అడపాల ప్రసాద్, ఎంబేటి చంద్రయ్య, పుల్లయ్య రఘు, నారాయణ, క్రాంతి, గంగిరెడ్డి, విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు. ఏపీ డప్పు కళాకారుల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా చనుమూరు క్రాంతి, ఉపాధ్యక్షులు అడపాల ప్రసాద్, బద్దేపూడి కృష్ణ, కార్యదర్శిగా రాగిపాటి నారాయణ, సహాయ కార్యదర్శిగా ఎంబేటి చంద్రయ్య, కనుపూరు ముత్యాలయ్య, ట్రెజరర్‌గా యేకుల రమణయ్యను, కమిటీ సభ్యులుగా మరో 15 మందిని ఎన్నుకున్నారు.

మౌలిక వసతులు కల్పించండి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక మున్సిపాల్టీ 2 వ వార్డు చెంచులక్ష్మి గిరిజనులు తమ కాలనీకి మౌలిక వసతులు కల్పించాలని సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వై.నందయ్య మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా, గిరిజనుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. గిరిజనులకు అటవీ హక్కు చట్టం ప్రకారం ప్రతి కుటుంబానికి రెండు ఎకరాల భూములు ఇవ్వాలని జస్టిస్ పున్నయ్య తీర్మానించినట్లు గుర్తు చేశారు. చెంచులక్ష్మి గిరిజనులకు ఇంటి స్థలాలు, స్మశానం, విద్యుత్ స్తంభాలు, సిమెంట్ రోడ్లు, అటవీ భూముల పంపిణీ వంటి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు, జిల్లా కలెక్టర్ స్పందించి చెంచులక్ష్మి గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కె.దొరస్వామి, కె.కృష్ణమ్మ, టి.చెంకలరాయులు, శివ, టి.శ్యామల, జి.ఊర్మిళ, తులసమ్మ, కె.స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ఆకలి కేకలు.. నాలుగు నెలలుగా జీతాలు లేవు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో :తిరుపతి సెంటర్లో అగ్రికల్చర్ కళాశాల ఆర్ఏఆర్ఎస్, ఏఆర్ఎస్‌లో పని చేస్తున్న వర్కర్స్‌కు గత నాలుగు నెలల నుంచి జీతాలు ఇవ్వకపోవడంతో కార్మికులు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతు ఆకలితో అలమటిస్తున్నారని, వీరికి తక్షణమే జీతాలు చెల్లించాలని సిఐటియు నాయకు డిమాండ్ చేశారు. గత 20 సంవత్సరాల నుండి నమ్ముకొని పనిచేస్తున్నప్పటికీ ఒక రోజు కూలి 395 రూపాయలు మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. దీంతో ఇల్లు గడవక అప్పులు పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఒకరోజు వేతనం 630 రూపాయలు ఇవ్వాలని తెలిపారు. కానీ ఇప్పటివరకు యూనివర్సిటీ యాజమాన్యం దాని అమలు జరపడం లేదన్నారు. వారికి వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని, లేనిపక్షంలో ఆందోళన చేయాల్సివస్తుందని హెచ్చరించారు.

షుగర్ వ్యాధిపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ప్రతి ఒక్కరికి షుగరు వ్యాధి పట్ల అవగాహన అవసరం అని, పుత్తూరు డాక్టర్ రవి రాజు పేర్కొన్నారు. సోమవారం పుత్తూరు విశ్రాంతి భవనంలో విశ్రాంతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు గుణశేఖర్ రెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా శోభ రాజు, విచ్చేసి వారి తండ్రి సంజీవ రాజు జ్ఞాపకార్థం. పక్కన ఉన్న కొత్త భవనానికి వారి పేరు పెట్టి విరాళం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి రాజు మాట్లాడుతూ షుగర్ వ్యాధి ఉన్నవారు వ్యాయామం చేస్తూ, ఆహార నియమాలు పాటించాలని సూచించారు. అనంతరం తిరుపతి అమరా హాస్పిటల్ వారు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన హెల్ప్ ఏజ్ ఇండియా వారి తరపున శ్యామ్ కుమార్ సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతి ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి టి.కుప్పయ్య, కోశాధికారి రామలింగం, రాష్ట్ర సంఘం కార్యదర్శి కృప వరమ్మ, సభ్యులు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి - వాకాడు: వాకాడు మండలం, వాల్మేడు గ్రామంలో సోమవారం వాకాడు మండల జడ్పిటిసి రౌతు రామకృష్ణ ఆహ్వానం మేరకు వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పాల్గొన్నారు. భారీ బైక్ ర్యాలీతో వాల్మేడు గ్రామానికి బయలుదేరారు. ఈ సందర్భంగా మేరిగ మురళీధర్ మాట్లాడుతూ మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణను ఎదుర్కొనేందుకే కోటి సంతకాలు సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఎస్ఇసి సభ్యులు కొడవలూరు భక్తవత్సల రెడ్డి, సర్పంచులు, వైసిపి నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్‌లో ఛాంపియన్ ఎస్పిడబ్ల్యు కాలేజీ

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినులు అక్టోబర్ 20వ తేదీ నుంచి 27వ తేదీ వరకు విశాఖపట్నం, గోపాలపట్నం బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియంలో జరిగిన టేబుల్ టెన్నిస్‌లో వివిధ విభాగాల్లో రాణించి ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ని కైవసం చేసుకున్నారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ భువనేశ్వరి తెలిపారు. గెలుపొందిన వారిలో మనస్విని జాతీయస్థాయికి ఎంపిక కావడం గర్వకారణమని విద్యార్థినిలను ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందించి, చదువుతోపాటు వివిధ క్రీడల్లో రాణించడం వలన పోటీతత్వం అలవడి భవిష్యత్తులో పోటీ పరీక్షలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. విద్యార్థులు మరింత నూతన ఉత్తేజంతో ముందుకు వెళ్లాలని ఉత్సాహపరిచి, ఫిజికల్ డైరెక్టర్ సాయి సుమతిని మరింత ప్రోత్సహించారు. గెలుపొందిన విజేతలు ఆర్. మనస్విని-జూనియర్ బైపిసి (జాతీయస్థాయికి ఎంపిక), జె.హర్షిత-జూనియర్ బైపిసి, స్పందన -జూనియర్ సిఇసి విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.

ఇండోర్ స్టేడియం పరిశీలన

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నూతనంగా నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియంను స్థానిక ఎమ్మెల్యే పులివర్తి నాని, శాప్ చైర్మన్ రవి నాయుడులు సోమవారం పరిశీలించారు. సుమారు 1 కోటి 50 లక్షల రూపాయలతో ఇండోర్ స్టేడియం నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. గత ప్రభుత్వం క్రీడారంగాన్ని నిర్వీర్యం చేసిందని శాప్ చైర్మన్ రవి నాయుడు తెలిపారు. ఇండోర్ స్టేడియం పనులు డిసెంబర్‌లోగా పూర్తి చేయాలని వారు కాంట్రాక్టర్‌కు సూచించారు. స్టేడియంకు నారా రామ్మూర్తి నాయుడు పేరు పెట్టనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

శ్రావణ సంధ్యకు డాక్టరేట్

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యా లయం బిజినెస్ మానేజ్మెంట్ విభాగం పరిశోధన విద్యార్థిని యన్. బి. శ్రావణ సంధ్యకు డాక్టరేట్ ప్రధానం చేసినట్లు డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. ఈమె ఆచార్య శోభారాణి మార్గదర్శకత్వంతో ఏ స్టడీ ఆన్ ట్రైబల్ ఉమెన్ పెర్సెప్షన్స్ ఆన్ అనిమియా అండ్ న్యూట్రిషనల్ ప్రాక్టీసెస్ ఇన్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై పరిశోధన గ్రంథం సమర్పించారు. ఇందుకు పరిశోధన విద్యార్థిని శ్రావణ సంధ్యకు డాక్టరేట్ ప్రధానం చేసినట్లు వెల్లడించారు.

జీవ శాస్త్రం ప్రాజెక్టు పనుల్లో గాయత్రి ప్రతిభ

ప్రజాశక్తి - పాకాల: జీవ శాస్త్రం ప్రాజెక్టు పనుల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దామల చెరువు 10 వ తరగతి విద్యార్థి గాయత్రి జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి గెలుపొందిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుమతమ్మ తెలిపారు. సోమవారం తిరుపతిలో జరిగిన విజ్ఞాన మేళాలో గాయత్రికి మొదటి స్థానం రావడం గర్వకారణమన్నారు. ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను అభినందించారు.